క్లుప్తంగా

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని లక్ష్మీపత్ సింగానియా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పూర్వా, నితిక్షలు బాక్సింగ్ అండర్14 విభాగంలో జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన డీఏవీ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో అండర్- 14 బాలికల విభాగంలో 32, 34 కిలోల, 48, 50 కిలోల బరువు కేటగిరీలలో పోటీ పడి విజయం సాధించి డీఏవీ నేషనల్స్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

చట్టాలపై అవగాహన అవసం



అవగాహన కల్పిస్తున్న తిరుమల

బెజ్జూర్: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని భరోసా టీం ఇన్‌చార్జి తిరుమల అన్నారు. బుధవారం మండలంలోని, బారెగూడ, సలుగుపల్లిలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల, జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బెజ్జూర్ ఎస్సై సర్తాజ్ పాషా విద్యార్థులకు సైబర్ క్రైం, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. అత్యాచార బాధితులకు భరోసా సెంటర్ అండగా ఉంటుందన్నారు. భరోసా కౌన్సిలర్ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీం, భరోసా సెంటర్లు పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, భరోసా టీం సిబ్బంది పాల్గొన్నారు.

108లో ప్రసవం

నెన్నెల: కుమురంభీం జిల్లా చింతలమానెపల్లికి చెందిన పంచపూల అనే మహిళకు బుధవారం సాయంత్రం పురుటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108వాహనానికి సమాచారం ఇచ్చారు. వెంటనే 108సిబ్బంది మంచిర్యాల ఎంసీహెచ్ ప్రభుత్వాస్పత్రికి తరలి స్తుండగా మార్గమధ్యన పురుటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108అంబులెన్స్ సిబ్బంది ఆమెకు ప్రసవం చేశారు. అంబులెన్స్‌లో పంచపూల మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నారని నెన్నెల ఈఎంటీ రాజేశ్వరి, పైలెట్ తిరుపతి తెలిపారు. 108సిబ్బందిని ఆమె కుటుంబ సభ్యులు అభినందించారు.

అడవి పందుల బీభత్సం



నేలవాలిన పత్తి కాయలు

కెరమెరి: మండలంలోని కెలిబి గ్రామ శివారులో ఉన్న సయ్యద్ లాలా వ్యవసాయ పొలంలో మంగళవారం రాత్రి అడవి పందులు బీభత్సం సృష్టించాయి. ఎకరంన్నర పత్తి చేనులో అడవి పందులు పత్తి మొక్కలను పీకి పారేశాయి. కాత, పూత కొచ్చిన మొక్కలు నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీలో ఇద్దరు జిల్లావాసులకు చోటు దక్కింది. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న పెరిక శ్రీకాంత్, సీహెచ్ శంకర్‌లు కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బుధవారం మున్సిపల్ యూనియన్ ఐదో రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. శ్రీకాంత్, శంకర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చేపడతామన్నారు.

బంద్ విజయవంతం చేయండి

కాగజ్‌నగర్ టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ పొన్న రమేశ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బీసీలను ఐక్యం చేసేందుకు గురువారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని యాదవ సంఘ భవనంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నికోడే రవీందర్, మాచర్ల శ్రీనివాస్, పుల్గం వెంకటేశ్, మెహరాజ్ పాల్గొన్నారు.

పొట్టకొట్టిన వాన..!



చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్‌లో నేలవాలిన వరి

- వరి పొట్ట దశలో భారీ వర్షాలు
- నేలవాలుతున్న వరి
- వందల ఎకరాల్లో నష్టం

కౌటాల: అన్నదాతలకు ప్రతీఏటా కష్టాలు తప్పడం లేదు. వరి నాటినప్పటి నుంచి పంటచేతికి వచ్చేదాక నష్టపోతూనే ఉన్నారు. వరి నాట్లు వేసిన అనంతరం విస్తారమైన వర్షాలు కురవడంతో అల్లాడిన రైతులు ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉండగా.. భారీ వర్షాలకు పంట నేలవాలుతోంది. యూరియా కొరత, పెరిగిన కూలీతో ఆందోళన చెందుతున్నారు. మరికొద్ది రోజుల్లో పంట చేతికి వస్తుందనే సమయంలో భారీ వర్షాల కారణంగా పంటకు నష్టం వాటిల్లింది.

వందల ఎకరాల్లో..

ప్రతీఏటా రైతులను అతివృష్టి, అనావృష్టి వెంటాడుతున్నాయి. యూరియా కొరతతో అసలే పంటలు ఆశించిన స్థాయిలో ఎదగలేదు. గత వారంలో కురిసిన భారీ వర్షాలకు చేతికి వచ్చిన వరి నేలవాలింది. అలాగే భారీ వర్షాలకు జిల్లాలోని కౌటాల, దహెగాం, పెంచికల్‌పేట్, బెజ్జూర్, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ మండలాల్లో పొట్ట దశలో ఉన్న వరికి నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 56 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వరి సాగు ఉన్న మండలాల్లో 34 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. భారీ వర్షాలకు వందల ఎకరాల్లో చేతికి వచ్చిన పంట వడ్లు పొలాల్లోనే నేలరాతున్నాయి.

దిగుబడిపై ప్రభావం..

పంట చేతికి వస్తుందనే సమయంలో భారీ వర్షాల రూపంలో రైతులకు నష్టం వాటిల్లింది. మరో వైపు యూరియా కొరత కారణంగా వరికి సకాలంలో ఎరువులు వేయలేదు. దీంతో పంట ఆశించిన స్థాయిలో ఎదగలేదు. అలాగే కలుపు మొక్కలు పెరగడంతో పాటు పంటకు ఎండు తేమ, అగ్గి తెగులు వంటి తెగుళ్లు సోకాయి. దీంతో దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిసిన పంట ధాన్యంను కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

ఆందోళన చెందవద్దు



వరి చాలా చోట్ల కోత దశకు రాలేదు. వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థలాలను పరిశీలిస్తున్నాం. భారీ వర్షాలకు నష్టపోయిన పంట వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు. వరి సాగు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తాం.

– ప్రేమలత, ఏవో, కౌటాల

చెరువే క్రీడా మైదానం!



కర్జి చెరువులో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

ఈ దృశ్యాన్ని చూస్తుంటే చుట్టూ పచ్చని చెట్లు, కొండల మధ్య ఉన్న విశాలమైన మైదానంలో క్రీడాకారులు క్రికెట్ ఆడుతున్నారని అనిపిస్తుంది. కానీ నిజానికి ఇది క్రీడామైదానం కాదు. దహెగాం మండలంలోని కర్జి గ్రామ సమీపంలో ఉన్న చెరువు ఇది. 2021లో భారీ వర్షాల వల్ల చెరువు మత్తడి ధ్వంసమైంది. మత్తడికి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏటా వర్షాకాలంలో వచ్చిన వరద నిలవడం లేదు. నీరంతా వృథాగా పోతోంది. చుక్క నీరు కూడా లేక పోవడంతో చెరువునే క్రీడాకారులు క్రీడామైదానంగా మార్చుకుని క్రికెట్ ఆడుతున్నారు. – దహెగాం

క్రీడలతో మానసికోల్లాసం



ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

దహెగాం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని కర్జి గ్రామంలో గత కొన్ని రోజులుగా కేపీఎల్-2 మెమోరియల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. బుధవారం ఫైనల్‌లో దహెగాం జట్టు, మంచిర్యాల జిల్లా కన్నెపల్లి జట్లు తలపడ్డాయి. విజేతగా దహెగాం నిలువగా రన్నరఫ్ కన్నెపల్లి జట్టు నిలిచింది. గెలుపొందిన దహెగాం జట్టుకు ప్రథమ బహుమతి రూ. 50 వేలు, ద్వితీయ బహుమతి కన్నెపల్లి జట్టుకు రూ. 20 వేలు అందజేశారు. క్రీడాకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామారావు, కర్జి మాజీ సర్పంచు ఎల్కరి సంజీవ్, పోతుగంటి భీమన్న, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆకాంక్షిత బ్లాక్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఆసిఫాబాద్: ఆకాంక్షిత బ్లాక్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం న్యూఢిల్లీ నుంచి నీతిఆయోగ్ సీఈవో రజత్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో నీతి ఆయోగ్ కింద చేపడుతున్న ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పన అంశాలపై సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని తిర్యాణి బ్లాక్‌లో నీతి ఆయోగ్‌లో భాగంగా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు, నైపుణ్యత శిక్షణ, వ్యవసాయ రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీతి ఆయోగ్ పథకం ద్వారా మంజూరైన నిధులతో ఆరోగ్యం, న్యూట్రిషియన్, విద్యారంగంలో వసతుల కల్పన, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాల మంజూరు, మౌలిక వసతుల కల్పన, గిరిజనులకు వైద్య సేవలందించేందుకు పూర్తి సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, పాఠశాలల భవనాల నిర్మాణం, రైతు వేదికలు, పాఠశాలల్లో కంప్యూటర్లు సమకూర్చడం, మౌలిక వసతులు, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలతో పాటు ఆకాంక్షిత బ్లాక్ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలు తెలియజేశారు. తిర్యాణి బ్లాక్‌లో భాగంగా గిరిజనులకు ఉపాధి అవకాశాల కల్పన, గ్రంథాలయం ఏర్పాటు, గిరిజనులకు కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, ఉపగణాంకాధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం పోరాడుదాం



పలు అంశాలపై తీర్మానం చేస్తున్న నాయకులు

బెజ్జూర్: హక్కుల సాధన కోసం ఆదివాసీలు ఐక్యంగా పోరాటాలు చేయాలని గోండ్వానా కోయ సంక్షేమ సంఘం బెజ్జూర్ మండల నాయకులు కోరెత తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో గోండ్వానా ఆదివాసీ కోయా సంక్షేమ సంఘం జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అందరు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. జీవో 49 శాశ్వతంగా రద్దు చేయాలని, లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని, ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దశలవారీగా పోరాటాలు చేపట్టాలన్నారు. తాగు నీరు, మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం అందించాలని, ప్రస్తుతం కొనసాగుతున్న మండలాల కమిటీలను పునర్ నిర్మాణం చేపట్టాలని తీర్మానం చేశారు. సమావేశంలో నాయకులు సోయం చిన్నన్న, తలండి మధుకర్, కుమురం మాంతయ్య, కుర్సింగ ఓంప్రకాష్, సిడాం సకారం, సిడం అశోక్, ఏనుక అమృత, నైతం సాయినాథ్, ఆత్రం బక్కయ్య పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు



కిట్లు చూపిస్తున్న ఎస్సై వెంకటకృష్ణ

రెబ్బెన: గంజాయిని సాగు చేసినా, వినియోగించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై వెంకటకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. దానిలో భాగంగా గ్రామాల్లో గంజాయిని సమూలంగా రూపుమాపేందుకు పోలీస్‌శాఖ గట్టి నిఘా పెట్టిందన్నారు. గుట్టుగా పంట చేలల్లో గంజాయి మొక్కలను సాగు చేస్తే ఊరుకోబోమని, సాగు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గంజాయిని సేవించినా, రవాణా చేసినా శిక్షార్హులన్నారు. మండలంలో గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక సిబ్బంది ద్వారా నిఘా పెట్టామని పేర్కొన్నారు. ప్రజలు గంజాయిని రూపుమాపేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీవో తిరుపతమ్మ

రెబ్బెన: పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా గర్భిణులు, కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో తిరుపతమ్మ అన్నారు. మండలంలోని గోలేటిలో పౌష్టికాహార మాసాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలతో పాటు కిశోర బాలికలు ఐసీడీఎస్ ద్వారా అందజేసే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, స్వర్ణలత, సుశీల, మంజుల, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రుణ సదుపాయం

బెజ్జూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని ఐకేపీ ఏపీఎం మోహన్ దాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఐకేపీ సంఘాల్లో సభ్యురాలుగా ఉంటే వారికి బ్యాంకు ద్వారా రూ.1లక్ష రుణం మంజూరు చేస్తామన్నారు. అలాగే ఐకేపీ సంఘాల్లో లేని ప్రతీ మహిళ గ్రూప్ సభ్యురాలిగా చేరాలన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం మహిళలకు వచ్చే ప్రతీ పథకం ఐకేపీ సంఘాల ద్వారా వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి రమేశ్



తిర్యాణి: కన్నెపెల్లిలో టీకాలు వేస్తున్న వైద్యుడు సాగర్



టీకాలు వేస్తున్న వెటర్నరీ వైద్యులు

దహెగాం: మండల కేంద్రంలో బుధవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి రమేశ్ ఆధ్వర్యంలో 200 ఆవులు, 80 గేదెలకు టీకాలు వేశారు. వచ్చే నెల 14 వరకు ఈ టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పశువుల యజమానులు పశు సంపదపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరేశ్, హనుమయ్య, సురేశ్, మల్లేశ్ రైతులు పాల్గొన్నారు.

తిర్యాణి: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తగా రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని పశు వైద్యుడు సాగర్ అన్నారు. బుధవారం మండలంలోని కన్నెపెల్లి, గిన్నెదరి గ్రామాల్లోని 247 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైద్య సిబ్బంది సురేశ్, మనోహర్, రాకేశ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని మిత్ర కాలనీ, కోసిని గ్రామంలోని మండల పశువైద్యాధికారి పరిమల ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. బుధవారం దాదాపు 1600 ఆవులు, గేదెలు, దూడలకు టీకాలను వేసినట్లు వైద్యాధికారి తెలిపారు. రెండు బృందాలుగా ఏర్పడి మిత్రకాలనీ, కోసినిలో టీకాలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో లైఫ్‌స్టాక్ అసిస్టెంట్ శైలేందర్, వీఏ అమన్, సునీల్, గోపాలమిత్ర జమీర్, రమేశ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.



కెరమెరి: టీకా చేస్తున్న వైద్యాధికారి సురేశ్

కెరమెరి: మండలంలోని కొఠారి గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఇచ్చినట్లు పశువైద్యాధికారి సురేశ్ అన్నారు. వచ్చే నెల రోజుల పాటు కొనసాగే కార్యక్రమం అన్ని గ్రామాల్లో కొనసాగుతుందన్నారు. 4 నెలలపై బడి ఉన్న పశువులకు టీకాలు ఇవ్వడం వల్ల వ్యాధులు నివారణ జరుగుతుందని పేర్కొన్నారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ వల్ల గాలికుంటు వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చన్నారు. జ



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

కౌటాల/చింతలమానెపల్లి: పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి అంజలి, ఎస్. శ్రీకాంత్ అన్నారు. కౌటాల మండలం తలోడి గ్రామంలో బుధవారం పశువులకు టీకాలు వేశారు. 4 నెలల వయస్సు పైబడిన పశువులన్నిటికీ ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. రైతులు పశుసంపదను పెంచాలని, పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. అలాగే చింతలమానెపల్లి మండలంలోని డబ్బా గ్రామంలో పశువులకు టీకాలు వేశారు.

క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కౌటాల: కౌటాల మినీ స్టేడియంలో కేపీఎల్ (కౌటాల ప్రీమియర్ లీగ్) సీజన్-2 క్రికెట్ పోటీల పోస్టర్‌ను బుధవారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 3 నుంచి పోటీలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ. 300 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ టోర్నిలో 14 ఫ్రాంచైజీలు ఉంటాయని, రూ. 35 వేలు చెల్లించి జట్టు పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ. 1.10 లక్షలు, ద్వితీయ బహుమతి రూ. 55వేల నగదుతో పాటు షీల్డ్ అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు డబ్బా గోపాల్, వెంకటేశ్, శంకర్ పాండ్యా, దీలిప్, శంక్, సాయికృష్ణ, శ్రీకాంత్, నాగేశ్, చంటి, అలీం పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఏపీజే అబ్దుల్ కలాం మాజీ 11వ రాష్ట్రపతి జయంతి బుధవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కర్జాగౌడ్ మాట్లాడుతూ మహనీయుని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుస్తూ ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు వైద్య వెంకన్న, కృష్ణాజీ, సిడాం సూరు, గౌరక్క, పద్మ, కుమార్‌స్వామి, మధుకర్, వెంకటయ్య, కనకమ్మ పాల్గొన్నారు.

‘అసంపూర్తి పనులు పూర్తి చేయాలి’



అసంపూర్తి పనులను వర్క్ ఇంజినీరుకు చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రెబ్బెన: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న నేషనల్ హైవే పనులను వెంటనే పూర్తి చేయాలని పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ బొమ్మినేని శ్రీధర్‌లు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నేషనల్ హైవే పనులపై పీడీకి ఫిర్యాదు చేయగా స్పందించిన ఆయన బుధవారం నేషనల్ హైవే వర్క్ ఇంజినీర్‌ను పంపించారు. దాంతో మండల కేంద్రంలో పనులు పెండింగ్‌లో ఉన్న ప్రాంతాలను ఆయనకు చూపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలో చేపట్టిన నేషనల్ హైవే పనుల్లో చాలా పనులు ఎన్నో నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అసంపూర్తిగా ఉన్న సైడ్‌డ్రెయిన్ పనులతో పాటు సెంట్రల్ లైటింగ్ పనులతో అనేక సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. దానితో పాటు ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్ రావు, భరద్వాజ్, ఉబేదుల్లా, వినోద్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీ టీం



మాట్లాడుతున్న ఎస్సై, షీటీం అధికారులు

కెరమెరి: మహిళల భద్రత కోసం ఎల్లప్పుడు షీటీం అందుబాటులో ఉంటుందని ఎస్సై ఎస్. మధుకర్, షీ టీం ఇన్‌చార్జి ఎస్సై బిక్కాలాల అన్నారు. బుధవారం మండలంలోని మోడి కేజీబీవీలో బాలికలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు, బాలికలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా, చీటింగ్, ఈవ్‌టీజింగ్ వంటి సంఘటనలు జరిగితే వెంటనే 100కు లేదా షీ టీం హెల్ప్ లైన్ డెస్క్ 8712670564ను సంప్రదించాలన్నారు. ఎస్‌వో ప్రవీణ, షీటీం సభ్యులు స్వప్న, దినేశ్, రజిత తదితరులు ఉన్నారు.